క్లుప్తంగా

వయోవృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 400 మంది వృద్ధులకు ఆయుర్వేదం, అల్లోపతి, హోమియోపతి వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, మోడ్రన్ కేఫ్ అధినేత మురళీధర్‌రావు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి 50 బారికేడ్లు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉపయోగించుకునేలా అనంత్ డైమండ్స్ వారు 50 స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందజేశారు. షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు వాటిని అందచేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో వారికి ఉపయోగపడేలా స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందచేసినట్లు తెలిపారు. బృందావనకాలనీ టిక్కిల్‌రోడ్డులోని షోరూమ్‌లో దసర నవరాత్రి వేడుకలు ప్రారంభించారు.

షిరిడీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయినాథుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోక్షీరంతో బాబాకు అభిషేకం జరిగింది. మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులచే సాయినాథ నరసింహ హోమం నిర్వహించారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు హోమాలు, పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. గాంధీనగర్‌లోని బాలు కళావేదిక నూతన కళా ప్రాంగణంలో ఆశీష్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాయని సత్యస్వాతికి ఆత్మీయ సత్కారం ఆదివారం నిర్వహించారు. కళాకారుల సంక్షేమం కోసం సాంస్కృతిక సంస్థలు కృషి చేయాల్సిన అవసముందన్నారు. సత్యస్వాతి ఆధ్వర్యంలో సూర్య,నాగార్జున,నరేష్,పీవీ లక్ష్మి,విజయలక్ష్మి, కనక దుర్గ, వీరశేఖర్ తెలుగు హిందీ గీతాలను ఆలపించారు. అనంతరం గాయని సత్యస్వాతిని నిర్వాహకులు సత్కరించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు



విజయవాడ కల్చరల్: సత్యనారాయణపురం కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచారిణి జాహ్నవి సుస్మ బృందం అన్నమయ్య, రామదాసు కీర్తనలను నృత్యాలను అభినయించారు. కూచిపూడి నాట్యాచార్యుడు సత్తువేణుగోపాల్ బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన కుంకుమపూజలు ఆలయ కమిటీల ఆధ్వర్యాన జరిగాయి.

అయోధ్యనగర్‌లో.....

అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీ ధర్మ పరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగగా ప్రారంభమయ్యాయి. శివకామేశ్వరీ అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి బెల్లం పరమాన్నం, వడపప్పు, చలిమిడి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు లలితా సహస్రనామ పారాయణం జరిగాయి.

బావాజీపేటలో.....

బావాజీపేట నాలుగో లైనులో శ్రీ దేవి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ అధ్యక్షతన నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి శ్రీస్వర్ణ కవచలాంకృత దుర్గాదేవి అలంకారంలో పూజలు చేశారు.

రామలింగేశ్వరపేటలో.....

రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీ పర్వతి వర్ధిని దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్యాలంపాడులో.....

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని స్వర్ణాలంకృత కనకదుర్గాదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు.

గద్దే వెంకట్రామయ్యనగర్‌లో....

గద్దే వెంకట్రామయ్యనగర్‌లో దేవుని మండపం వద్ద భక్త బృందం ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. దావు బుచ్చయ్య కాలని శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి.



శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు

మధురానగర్‌లో....

మధురానగర్ మెయిన్ రోడ్డులోని అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో....

మధురానగర్ నేతాజీ కాలనిలోని శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా దసరా మహోత్సవాలు

విజయాడ కల్చరల్: శోభకృతు నామ సంవత్సర దసరా మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దేవాలయాల సాంప్రదాయాలనుసరించి జగన్మాతను వివిధ రూపాలతో అలంకరించారు.

హనుమాన్‌పేటలో...

విశ్వమాత ఛారిటబుల్ ట్రస్ట్, కుర్తాళం సిద్ధేశ్వరానంద పీఠం ఆధ్వర్యంలో హనుమాన్‌పేటలోని శంకరమఠంలో కొలువైవున్న అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. లోక కల్యాణార్థం వేద పండితుల ఆధ్వర్యంలో మహాలక్ష్మీ హోమం నిర్వహించారు.

లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం:



శివరామకృష్ణ క్షేత్రంలో

కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శారదామాతను బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. 11రోజుల పాటు నిర్వహించే పద్మావతి స మేత శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు ఆది వారం ప్రారంభమయ్యాయి. శివరామ కృష్ణ క్షేత్రంలో శృంగేరీపీఠ సాంప్రదాయాన్ని అనురించి బాలాత్రిపుర సుందరీ దేవాలయంలో బాలాత్రిపుర సుందరిగానూ, శారదామాతను హంసవాహన బ్రాహ్మి, మహాలక్ష్మిని ఆదిలక్ష్మిగానూ అలంకరించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లాది ...

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా కాశి విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో రజిత కవచాలంకృతదేవి అలంకారంలోని అన్నపూర్ణదేవిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలసి దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. పాలకమండలి సభ్యులు మంగళంపల్లి చంటి, బుర్రె రాధిక, ఎం.శ్రీదేవి, సుబ్రహ్మణ్యకుమార్, వైఎస్సార్ సీపీ నేతలు దోనేపూడి శ్రీనివాసరావు, కనగవర్వు శ్రీనివాసరావు, లంక బాబు, రంగారావు పాల్గొన్నారు.



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..



జోజినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



బావాజీపేటలో శ్రీస్వర్ణ కవచలాంకృత దుర్గాదేవిగా అమ్మవారు



మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న పండితులు

మౌలిక వసతులపై వీఎంసీ ప్రత్యేక దృష్టి

- రూ.5.43 కోట్ల పనులకు స్థాయిసంఘం ఆమోదం
- రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు
- కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు



స్థాయిసంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు వీఎంసీ పాలక పక్షం పలు నిర్ణయాలు తీసుకుంది. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి రూ.5.43కోట్లు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించడానికి ఇటీవల మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన స్థాయి సంఘం తీర్మానాలు చేసింది. అందులో సర్కిల్–1 పరిధిలోని 5 పనులకు రూ. 2.5కోట్ల నిధులు, సర్కిల్–2 పరిధిలో నాలుగు పనులకు రూ. 1.71 కోట్లు, సర్కిల్–3 పరిధిలో మూడు పనులకు రూ. 1.06 కోట్లు నిధులు వెచ్చించనున్నారు.

సర్కిల్–1 పరిధిలో..

- 34వ డివిజన్లోని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు డ్రెయిన్ నిర్మాణానికి రూ. 34 లక్షలు నిధులు వెచ్చించనున్నారు
- 42వ డివిజన్‌లో రామాలయం స్ట్రీట్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 22.77 లక్షలు
- 42వ డివిజన్‌లో నేతాజీ స్కూల్ మెయిన్ రోడ్డులో 330 మీటర్ల దూరం వరకు రూ.49.84 లక్షలు
- 45వ డివిజన్ పయ్యావుల దశరథ్ స్ట్రీట్‌లో అంబేడ్కర్ రోడ్డు నుంచి 300 మీటర్ల వరకు రూ.24.53లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 43వ డివిజన్‌లో ఊర్మిళా నగర్ మెయిన్ రోడ్డు నుంచి పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఆటోస్టాండ్‌వరకు సీసీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.49.74 లక్షలు

సర్కిల్–2 పరిధిలో..

- 30వ డివిజన్ రామకృష్ణాపురం వద్ద ముత్యాలంపాడు డీపీ స్టేషన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్ వరకు ఎస్‌టీపీకి కలిపే పంపింగ్ మెయిన్ రోడ్డులో విజయవాడ–హౌరా రైల్వేట్రాక్ బాక్ కల్వరుట వద్ద ఎస్‌టీపీ పైపు తుప్పిపట్టింది. స్థానికంగా డ్రైనేజీ లీకవుతుండటంతో స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్తగా పైపు ఏర్పాటు చేయటానికి రూ.72.15లక్షలు నిధులు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి వెచ్చించనున్నారు
- 58వ డివిజన్ నందమూరి నగర్ మెయిన్‌రోడ్డు నుంచి ఇన్నర్‌రింగ్‌రోడ్డును కలిపే వశిష్ట కాలనీ మెయిన్ రోడ్డును బీటీ రోడ్డు నిర్మాణనికి రూ. 36.45లక్షలు
- 60వ డివిజన్‌లో వాంబే కాలనీ డీపీ స్టేషన్ నుంచి అజిత్‌సింగ్ నగర్ ఎస్‌టీపీకి కలిపే పైపులైను వాంబేకాలనీ వెనకభాగంలో తుప్పుపట్టి నీరు లీకవుతుంది. దీని పరిష్కారానికి రూ.23.89 లక్షలు
- 23, 24 డివిజన్ల పరిధిలోని కూర్మయ్య వంతెన రోడ్డు, నక్కల రోడ్డులో ట్రాఫిక్ రాకపోకలతో రోడ్డు మరమ్మతులకు గురవడంతో ఈ ప్రాంతంలో బీటీ రోడ్డు వేయటానికి రూ. 39.20 లక్షలు వెచ్చించనున్నారు.

సర్కిల్–3 పరిధిలో..

రాణిగారితోట 18వ డివిజన్‌లో రామాలయం నుంచి తారకరామానగర్ వరకు ప్రస్తుతం ఉన్న డ్రెయిన్ మరమ్మతులకు గురవ్వటంతో స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నూతన డ్రెయిన్ నిర్మాణానికి రూ. 39.72 లక్షలు వెచ్చించనున్నారు.

- రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్‌లో ఫిష్‌మార్కెట్ పాత బ్రిడ్జినుంచి స్క్యూబ్రిడ్జి వద్ద వీఎం రంగా పార్కు వరకు బందరుకాల్వ వెంట తాగునీటి పైపులైను ఏర్పాటుకు రూ.29.80లక్షలు
- 3వ డివిజన్‌లోని గోకుల్ వారి వీధి, పానుగుమాటి వారి వీధి, దోసనపూడి సూర్యనారాయణ వీధులకు సీసీ రోడ్డు వేయటానికి రూ. 39.46లక్షలు నిధులు వెచ్చించనున్నారు.

నగరం మరింత అభివృద్ధి

నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రతి నెలా జరిగే స్థాయీ సంఘం సమావేశంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో, వైఎస్సార్ సీపీ వీఎంసీ పాలక పక్షం ఆధ్వర్యంలోనే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్

ఉత్సవాల్లో నిర్విరామంగా వీఎంసీ సేవలు



స్నానఘాట్ల వద్ద శుభ్రం చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో వీఎంసీ సిబ్బంది నిర్విరామంగా సేవలు అందిస్తున్నారని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో దుర్గగుడి, స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ జరిగే 27 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేశారు. క్యూలైన్, ఘాట్‌లో కొండపై వరకు కూడా వివిధ ప్రాంతాల్లో ఉచిత వాటర్ ప్యాకెట్స్ లొకేషన్స్ ఏర్పాటు చేశామన్నారు. 12 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం 120 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది వసతి గృహం వద్ద మరో 50 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్టేట్ విభాగం నుంచి రథం సెంటర్ వద్ద, కార్పొరేషన్ మెయిన్ ఆఫీస్ బిల్డింగ్ ఎదురుగా, సీతమ్మ పాదాల దగ్గర, భవానీపురంలో, రాజీవ్ గాంధీ పార్క్ ఎదురుగా భక్తుల కోసం ఉచితంగా ఆరు ఉచిత క్లాక్ రూమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్నానఘాట్లలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండటానికి 1500 మందికి పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం 24 గంటలు మూడు షిఫ్టులు వారీగా పని చేస్తున్నారన్నారు. వీఐపీలకు దుర్గమ్మ దర్శనానికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తరఫున ఏడు కారులను కేటాయించామని, వివిధ విభాగాల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.

జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు చదవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు చదవాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం భగవద్గీత పఠనం, నృత్య తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె. రమాదేవి, సిబ్బంది జే శంకర్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో కలామ్ జయంతిని నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు రాకెట్స్ శాటిలైట్స్ స్పేస్ సైన్స్ పై న వేసిన డ్రాయింగ్స్ అందరినీ అలరించాయి. డ్రా యింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని భాగ్యలక్ష్మిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నేతలు బోరా బుజ్జి, రామిరెడ్డి, దుర్గాప్రసాద్, గ్రేస్సీ, నోడల్ ఆఫీసర్ సైదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశం గర్వించదగిన మహామనిషి ఏపీజే అబ్దుల్ కలాం అని యువత ఆయన స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం కలాం 92వ జయంతి జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అ బ్దుల్ కలాం అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలాం జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎండీ హ ఫీజుల్లా, చింతా శ్రీను,షేక్‌జిలాని,అమిత్, షఫి,మోహ న్, మున్నీ, అబ్జల్ బాషా, ఆసిఫ్, వహీద్ పాల్గొన్నారు.

ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా జరిగింది. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

పాయకాపురం(విజయవాడరూరల్)భారతదేశపు మిస్సైల్ మాన్‌గా పిలవబడే వ్యక్తి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. కలాం జయంతి కార్యక్రమం ఆదివారం కెఎస్‌వెల్‌నెస్ సెంటర్ పాతరాజీవ్‌నగర్‌లో జరిగింది. అనంతరం కర్నూల్‌లో జరిగే 10వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులకు టీషర్టులను అందచేశారు. కార్యక్రమంలో 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బల్లం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ గాస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. లో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కలాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా, నేతలు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఉచిత కుట్టు శిక్షణ ఏర్పాటు అభినందనీయం

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. ఏపీ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో నగరంలోని ఫుడ్ జంక్షన్ వద్ద శ్రీ కృష్ణ మహిళా ఉచిత కుట్టు మిషన్ ఏర్పాటు చేశారు. తోలేటి శ్రీకాంత్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ అధ్యక్షులు ఆరికట్ల గోవర్ధన శాస్త్రి, తెలంగాణ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం అధ్యక్షులు రామడుగు నరసింహాచార్యులు, విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి సున్నపు భ్రమరాంభ, సభ్యులు వేముల రేణుక, నవత, దుర్గా పాల్గొన్నారు.

కనులారా.. మనసారా..



ఇంద్రకీలాద్రి పరిసరాలు జై దుర్గ.. జైజై దుర్గ నామస్మరణతో మార్మోగాయి. దసరా ఉత్సవా ల్లో తొలిరోజు ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను భక్త జనం కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి

కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సులో డాక్టర్ రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి సాధించామని కార్డియాలజిస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. ఒకప్పుడు శస్త్ర చికిత్సలతో నయం చేసే గుండె జబ్బులను, ఇప్పుడు ఇంటర్వెన్షనల్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం గుండె జబ్బుల వైద్యంలో శస్త్ర చికిత్సలకు బదులుగా వచ్చిన ఇంటర్వెన్షన్ వైద్య విధానంలో అధునాతన వైద్య విధానాలపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నగరంలో 'స్ట్రక్చరల్ కార్డియాక్ ఇంటర్వెన్షన్స్ కాంక్లేవ్–2023 పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కార్డియాలజిస్టులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్.జ్యోతి ప్రకాష్, డాక్టర్.వాసుదేవ్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్. ఎస్.రాజా రమేష్ ,డాక్టర్.హరిత మాట్లాడారు. డాక్టర్ దగ్గుబాటి రమేష్ వర్చువల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, తిరుపతి పద్మావతి చిన్న పిల్లల గుండె వైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనాథ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ఎస్ కేశవ రావుబాబు పాల్గొన్నారు.

వీఎంసీ కార్యాలయాల్లో నేడు స్పందన రద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో జరిగే సోమవారం స్పందనను దసరా ఉత్సవాల కారణంగా రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ అధికారులు నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తుండటం, ట్రాఫిక్ మళ్లింపులతో ప్రజలు కార్పొరేషన్ బిల్డింగ్ వద్దకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉండటంతో స్పందన రద్దు చేస్తున్నట్లు వివరించారు.

మత్తు వైద్యంపై ప్రజలకు అవగాహన అవసరం

మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తారకప్రసాద్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మత్తు వైద్యం(ఎనస్తీషియా)పై ప్రజలకు విస్తృత అవగాహన అవసరమని ఏపీ మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ అన్నారు. అక్టోబరు 16 ప్రపంచ మత్తు వైద్య దినోత్సవం పురస్కరించుకుని ఎనస్తీషియాపై అవగాహన కలిగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఐఎంఏ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ పిలుపుపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న వైద్య కళాశాలల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్టోబరు 16,1846లో అమెరికాలోని హాస్పటల్‌లో తొలిసారిగా ఈథర్ ద్వారా మొదటిసారిగా రోగికి మత్తు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఏటా అక్టోబరు 16న 150 దేశాల్లో ఎనస్తీషియా డే జరుపుకుంటామన్నారు. ఎనస్తీషియాలో 175 సంవత్సరాల్లో ఎన్నో ఆధునిక పద్ధతు లు అందుబాటులోకి వచ్చాయన్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ టి.సూర్యశ్రీ, మత్తు వైద్యుల సంఘం విజయవాడశాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విశ్వేశ్వరరావు, ఏపీ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ పిదు ర్గాప్రసాద్, డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని ఎమ్మెల్యే ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన మల్లాది విష్ణును ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం ప్రసాదాలను అందచేశారు.